నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శనివారం | 20 జులై 2024 పేజీలు 8

# త్వరలోనే టిడ్కో గృహాలు అందిస్తాం

- పేదలకు నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- మహిళా మార్ట్‌కు శంకుస్థాపన
- మంత్రి టిజి.భరత్



2లో

టిడ్కో గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

# తుంగభద్ర డ్యాంకు
# కొనసాగుతున్న వరద



తుంగభద్ర డ్యాంలోకి వరదనీరు వచ్చి చేరుతున్న దృశ్యం

- శ్రీశైలానికి చేరుతున్న వరదనీరు
- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి
- ఉమ్మడి జిల్లాలో వర్షాలు
- కర్నూలు జిల్లాను వీడని ముసురు
- నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కర్నాటకలోకి తుంగభద్రడ్యాంలోకి వరదనీటి చేరిక కొనసాగుతోంది. గురువారం నుండి జలాశయంలోకి వరదనీటి చేరిక ప్రారంభం కాగా, అది శుక్రవారం కూడా కొనసాగింది. శుక్రవారం డ్యాంలోకి 1,06,723 క్యూసెక్‌ల వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 55.97 క్యూసెక్‌ల నీరునిల్వ ఉంది. ఇక, శ్రీశైలం జలాశయంలోకి కూడా స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం సాయంకాలానికి 32,673 క్యూసెక్‌ల వరద నీరు వచ్చి చేరుతోండగా, 215 టిఎంసిల గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న శ్రీశైలం జలాశయంలో 33.3895 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఇక్కడ తెలంగాణా రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తోండగా, ఆంధ్రప్రదేశ్ మాత్రం అవసరమైన సమయాల్లో ఉత్పత్తి చేస్తోంది. కర్నాటకలో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. అక్కడి ఆల్మట్టి డ్యాంకు భారీగా వరద నీరు చేరుతుండడంతో 14 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నదిలోకి 65 వేల క్యూసెక్‌ల నీరు చేరుతోంది.

మిగతా 2లో

- గత ప్రభుత్వ పాలనపై ధ్వజమెత్తిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- చెంతనే నీరున్నా.. తప్పని త్రాగునీటికి కష్టాలు..
- గత ప్రభుత్వ అవినీతిపై ఆధారాలతో చూపుతాం : మంత్రి బిసి, ఎమ్మెల్యే గౌరు
- వేదవతి, గుండ్రవుల నిర్మిస్తే జిల్లా సస్యశ్యామలం : ఎంపీ బస్తిపాటి
- వెలుగోడు రిజర్వాయర్‌కు అసలు మోటార్లే బిగించలేదు : నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి
- కృష్ణ బోర్డును కర్నూలులోని ఏర్పాటు చేయాలి: బొగ్గుల, గౌరు
- పట్టిసీమ నీరు రాయలసీమకు ఉపయోగమా కదా ఎమ్మెల్యే బి.వి
- సుంకేసుల ఎగువన రిజర్వాయర్ నిర్మాణం జరగాలి తీర్మానించిన సమావేశం

"చెంతనే నీరున్న జిల్లా ప్రజలకు తాగునీటి కష్టాలు తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలంలోనే వారానికి ఒకసారి తాగునీటి సరఫరా అవుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాగునీటి సమస్యతో ప్రజలు విసిగిపోయారు. గత పాలకులు, అధికారులు ఏం చేశారని మంత్రులు ఎమ్మెల్యేలు అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా అధికారులు సమగ్ర విచారణ చేసి జిల్లా ప్రజలకు తాగునీరు అందించాల్సిన అవసరం ఉందని ప్రజా ప్రతినిధులు జడ్పీ సమావేశం దృష్టికి తెచ్చారు."

**కర్నూల్ ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ సమావేశం జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్ హాజరయ్యారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించాలి కానీ మంత్రులు ఫరూక్, బి.సి జనార్దన్ రెడ్డిలు ముచ్చుమర్రికి పార్టీ కార్యక్రమం పై వెళ్లి బాలిక కుటుంబాన్ని పరామర్శించి రావడానికి 40 నిమిషాలు ఆలస్యంగా 11.40 నిమిషాలకు ప్రారంభించారు. దీనికి మంత్రి బి.సి మాట్లాడుతూ సమావేశం ఆలస్యంగా వచ్చినందుకు ప్రతి ఒక్కరు క్షమించాలని కోరారు.

మిగతా 6లో

# త్రాగునీటి సమస్య పై గరం..గరం..



జడ్పీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రులు,కలెక్టర్లు

# ఆగస్టులో అన్న క్యాంటీన్లు

- నగరంలో ఐదు చోట్ల క్యాంటీన్ల ఏర్పాటు
- భవనాల మరమ్మత్తు పనులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అన్న క్యాంటీన్లను ఆగస్టు నెలలో ప్రారంభించేందుకు వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలి దశలో కర్నూలు నగరంలో

మిగతా 2లో



అన్న క్యాంటీన్లో మరమ్మత్తు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ

## చిన్నారిని బలిగొన్న వారిని
# వదిలే ప్రసక్తే లేదు



2లో

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మైనారిటీశాఖ మంత్రి ఎన్.ఎం.డీ ఫరూక్

## గాజులదిన్నె ప్రాజెక్టును
# ఐఆర్ఎస్ అధికారులు సందర్శన

- జలజీవన్ మిషన్ పనులను పరిశీలించిన అధికారులు



2లో

గాజులదిన్నె ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఐఆర్ఎస్ అధికారి చింతరంజన్దాస్

## ఉమ్మడి జిల్లాల ఎన్నికల
# తహశీల్దార్ల బదిలీ

వార్త 8లో

## ఆరు మంది
# క్రైమ్ కానిస్టేబుల్స్ బదిలీ

వార్త 7లో

# త్వరలోనే టిడ్కో గృహాలు అందిస్తాం


మహిళా మార్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించబడి వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన టిడ్కో గృహాల్లో మౌళిక సదుపాయాలు కల్పించి త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ తెలిపారు. పేదలకు నివాసం కల్పించడమే తెదేపా ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. శుక్రవారం జగన్నాథగట్టుపై నిర్మించిన టిడ్కో గృహాల వద్ద 1.38కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మహిళా మార్ట్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. తెదేపా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్న అక్కసుతోనే వైకాపా ప్రభుత్వం టిడ్కో గృహాల్లో కనీస వసతులు కల్పించలేదని ఆయన ఆరోపించారు. వైకాపా జండా రంగులు వేయడంలో చూపించిన శ్రద్ధ లబ్దిదారులకు ఇళ్లను అందించడంలో చూపించలేకపోయారని ఆయన విమర్శించారు. టిడ్కో గృహాల కోసం లబ్దిదారులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో టిడ్కో గృహాల సమస్యలను లబ్దిదారులు తమ దృష్టికి తీసుకువచ్చారని, వీటన్నిటిని త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. మహిళా మార్ట్‌లో టిడ్కో నివాసితులకు సరసమైన ధరలకే నిత్యావసర వస్తువులు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి అన్న కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు వారి సంక్షేమం కోసమే మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. టిడ్కో ఇళ్లు కర్నూలు నగరానికి తలమానికమైనదని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో ప్రస్తుతం 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వారికి అవసరమైన మౌళిక వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ త్వరలోనే అన్ని మౌళిక సదుపాయాలు కల్పించి లబ్దిదారులు ఇళ్లలో చేరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళలు మహారాణులని చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తారని, తెదేపా హయాంలో ఓర్వకల్లు మహిళలు విదేశాల్లో కూడా తమ ప్రతిభను చాటారని గుర్తు చేశారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో అన్ని సదుపాయాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఏపి టిడ్కో ఎస్ఇ రాజశేఖర్, డిఇలు హరికృష్ణ, రవికుమార్ గుప్త, పవన్‌కుమార్, ఏఇలు కౌశియా, వి.నాయక్, మహిళా మండలి అధ్యక్షురాలు ముంతాజ్, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
Union Bank of India
పద్మావతి నగర్ శాఖ
డి.నెం. 25-684-408, మెయిన్ రోడ్డు, పద్మావతి నగర్, నంద్యాల
స్వాధీనత ప్రకటన {సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(1)} (స్థిరాస్తి నిమిత్తం)
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 3తో చదవబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ మునుపటి ఆంధ్రాబ్యాంక్ ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పద్మావతి నగర్ శాఖ (27681) అధీకృత అధికారియగు దిగువ సంతకందారు 23-04-2024 తేదీ గల డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తం రూ. 55,80,183.00 (యాభై అయిదు లక్షల ఎనభై వేల నూట ఎనభై మూడు రూపాయలు) చెల్లించ వల్సిందిగా
దరఖాస్తుదారు: శ్రీ షేక్ కరిముల్లా తండ్రి పేరు : షేక్ సయ్యద్, డి.నెం. 5-12బి, పప్పుల బట్టీ వీధి, కన్యకా పరమేశ్వరి పాఠశాల ఏరియా సమీపాన, సుంకులమ్మ గుడి వీధి, నంద్యాల.
సహ-దరఖాస్తుదారు: శ్రీమతి షేక్ ముంతాజ్ భర్త పేరు : షేక్ కరిముల్లా, డి.నెం. 5-12బి, పప్పుల బట్టీ వీధి, కన్యకా పరమేశ్వరి పాఠశాల ఏరియా సమీపాన, సుంకులమ్మ గుడి వీధి, నంద్యాల వారిని కోరారు.
రుణగ్రహీత సదరుమొత్తం వెనుకకు చెల్లించుటలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8తో చదవబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ పేర్కొన్న ఆస్తిని దిగువ సంతకం దారు 18-07-2024 వ తేదీన స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా రుణగ్రహీతలకు నోటీసు ద్వారా, ప్రజానీకానికి సాధారణంగా తెలియజేయడమైనది.
సదరు ఆస్తితో వ్యవహరించరాదనియూ, ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా రుణ గ్రహీతల నుండి బకాయి ఉన్న మొత్తం రూ. 55,80,183.00 (యాభై అయిదు లక్షల ఎనభై వేల నూట ఎనభై మూడు రూపాయలు) మరియు దానిపైన వడ్డీ రాబట్టుకొనుట కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హక్కుకు లోబడి ఉంటాయని రుణ గ్రహీతలను ప్రత్యేకించి, ప్రజానీకాన్ని సాధారణంగా ఇందుమూలంగా హెచ్చరించడమైనది.
సెక్యూర్డ్ ఆస్తిని విడిపించుకునేందుకు లభ్యమగు సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (8) లోని ఏర్పాట్లను గమనించ వలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.
**స్థిరాస్తి వివరాలు:** నంద్యాల జిల్లా & నంద్యాల జిల్లా ఎస్ఆర్ఓ, నంద్యాల రెవెన్యూ హద్దులలో, నంద్యాల రజియా మసీద్ ఎదుట, వార్డు -7, నడిగడ్డ ప్రాంతం, నబీ నగర్, డి.నెం. 7/80-సి5-6, సర్వే నెం. 1693 పైకిలో 117 చ.గజాల విస్తీర్ణంతో శ్రీ షేక్ కరిముల్లాకు చెందిన నివాస భూమి మరియు భవనం యావత్తు. హద్దులు: తూర్పు: 15 అడుగుల రోడ్డు, పశ్చిమం: కె. కరీమ్ బాషా మరియు ఇతరుల స్థలము, ఉత్తరం: సయ్యద్ షఫీవున్నీసా ఇల్లు, దక్షిణం: షేక్ జమాల్ బాషా ఇల్లు.
తేదీ:18-07-2024, ప్రదేశము:నంద్యాల అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

## తుంగభద్ర డ్యాంకు కొనసాగుతున్న వరద

(మొదటి పేజీ తరువాయి)

129 టిఎంసిల గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ఆల్మట్టిలో నీటి నిల్వలు 100 టిఎంసిలు దాటడంతో గేట్లు ఎత్తారు. నారాయణపూర్ జలాశయంలోకి వరద నీరు చేరుతోంది. ఇక, తెలంగాణాలోని జూరాల డ్యాం వద్ద విద్యుత్ ఉత్పత్తి అనంతరం 20,079 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. 9.66 టిఎంసిల గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న జూరాలలో ప్రస్తుతం 6.99 టిఎంసిల నీరు ఉంది. ఇక్కడి నుండి నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, భీమాకు 300 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. కుడి, ఎడమ కాలువలకు కూడా నీటిని విడుదల చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో వర్షాలు.. కర్నూలు జిల్లాను వీడని ముసురు :** అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులుగా కర్నూలు జిల్లాను ముసురు వీడడం లేదు. తెరిపి లేకుండా చినుకులు కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో శుక్రవారం 26 మండలాలుండగా, 21 మండలాల్లో సగటున 3.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దేవనకొండ మండలంలో అత్యధికంగా 22.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సి.బెళగల్ మండలంలో అత్యల్పంగా 0.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కర్నూలు జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 77.7 మిల్లీమీటర్లు కాగా, 140 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక జూలై నెలలో 90.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 35.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లాలో మాత్రం భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో 29 మండలాలుండగా, అన్ని మండలాల్లో వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలో అత్యధికంగా పాములపాడు మండలంలో 62.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, పాణ్యం మండలంలో అత్యల్పంగా 1 మిల్లీమీటర్ వర్షపాతం నమోదైంది. అల్పపీడనం ప్రభావం మరో ఐదు రోజులు కొనసాగనున్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో ఉమ్మడి జిల్లాలో మరో ఐదు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## చిన్నారిని బలిగొన్న వారిని వదిలే ప్రసక్తేలేదు

**- ముచ్చుమర్రిలో మంత్రుల హామీ**

**నందికొట్కూరు, మేజర్‌న్యూస్ :**

చిన్నారిని బలిగొన్న వారిని వదిలే ప్రసక్తే లేదని బాధిత కుటుంబానికి ముచ్చుమర్రిలో మంత్రులు హామీ ఇచ్చారు. శుక్రవారం మంత్రులు ఫరూక్, బీసీ.జనార్ధన్‌రెడ్డిలు పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో అత్యాచారం హత్యకు గురైన బాలిక(9) కుటుంబాన్ని పరామర్శించారు. అనంతగరం బాలిక తల్లిదండ్రులకు 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. వారి పిల్లల చదువు కొనేందుకు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్.ఎండి. ఫరూక్ మాట్లాడుతూ గతంలో ఇక్కడ మృతదేహాలు లభ్యం కానీ సంఘటనలు జరిగాయని అన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతం కావడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరిగేందుకు అవకాశం ఏర్పడిందని, ఇక మీదట ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపడుతుందని అన్నారు. మరో మంత్రి బి.సి. జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అవలంబించిన విధానాల వల్ల గంజాయి ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా లభించడం వల్లనే చెడు వ్యసనాలకు పాల్పడుతున్నారని అన్నారు. వాటిని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాలిక మృతదేహం లభ్యం కాకపోవడం హృదయాన్ని కలచివేస్తుందని, ఇది చాలా భాధాకరమైన సంఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. బాలిక మృతికి కారణమైన ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తి లేదని వారు ఎంతటి వారైనా సరే విడిచి పెట్టే పరిస్థితి లేదని అన్నారు. కొత్త ఇంటి నిర్మాణానికి సహకరిస్తామని అలాగే ప్రభుత్వం అన్ని రకాలుగా బాలిక కుటుంబాన్ని ఆదుకుంటుందని తెలియజేశారు.

**నా పాప నాకు కావాలి- బాలిక తల్లి :** మంత్రుల నుండి 10 లక్షల చెక్కు అందుకుంటున్న సమయంలో బాలిక తల్లి నా పాప నాకు కావాలంటూ రోదించిన తీరు అక్కడి వారిని కలచివేసింది. ఎన్ని లక్షలు ఇచ్చినా లక్షణమైన చిన్నారిని కోల్పోయిన వారి బాధ వర్ణనాతీతంగా ఉంది. మంత్రుల వెంట నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్త జయసూర్య, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ పాల్గొన్నారు.

## ఆగస్టులో అన్న క్యాంటీన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఐదు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన మరమ్మత్తుల పనులను కర్నూలు నగరపాలక సంస్థ చేపట్టింది. కల్లూరు ఎస్టేట్ సమీపంలోని సెట్కూర్ కార్యాలయం వద్ద, వై.జంక్షన్ సమీపంలోని పరిమళనగర్‌లో, కలెక్టరేట్ ఆవరణలో, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో, పాత బస్టాండ్‌లో అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించబోతున్నారు. మరమ్మత్తు పనులను శుక్రవారం కెఎంసి కమిషనర్ భార్గవ్ తేజ పరిశీలించారు. నెలాఖరునాటికి పనులు పూర్తి చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. ఆయన వెంట ఎంఇలు షాకిర్, శేషసాయి, డిఈఈలు రవిప్రకాష్‌నా యుడు, గిరిరాజు, రాజశేఖర్, ఏఈలు దినేష్, జనార్ధన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### రైతులకు పెట్టుబడి సాయం -రూ.20వేలు ఇవ్వండి

**బనగానపల్లెమేజర్,న్యూస్:**

రైతులకు పెట్టుబడి సాయం 20వేల రూపాయలు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ పెట్టుబడి సాయం 20వేల రూపాయలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని మూడవ సచివాలయ అధికారి శివకు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సి.ఐ.టి.యు కార్యదర్శి సుబ్బయ్య, మనోహర్, గోపాల్, వెంకటేశ్వర్లు, సాలయ్య, మద్దిలేటి, గిడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి సర్వే కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలంలోని పెద్దవంగలి గ్రామము నందు జరుగు కుష్టువ్యాధి సర్వే కార్యక్రమాన్ని వైద్యాధికారిణి తస్నీమా సుల్తానా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.కుష్టు వ్యాధి సర్వే పై ఆశా కార్యకర్తలు, మేల్ వాలంటీరులకు తగు సూచనలు ఇచ్చారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి 9 గంటల లోపు సర్వే చేయాలన్నారు. స్త్రీలకు ఆశా కార్యకర్త పురుషులకు మగవాలంటీర్ తల నుండి పాదముల వరకు శరీరం లోని ప్రతిభాగమును క్షుణ్ణంగా పరిశీలించి ఏదైనా స్పర్శలేని మచ్చలుంటే వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు పంపడం జరుగుతుందన్నారు. అక్కడ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే మందులను ఇప్పించి పంపడం జరుగుతుందన్నారు. అలాగే మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఏడవ వార్డులో పురుషుల సంబంధించిన కుష్టు వ్యాధికి సంబంధించిన వాటిని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు,హెల్త్ అసిస్టెంట్ మనోహర్,సిహెచ్ఓ కవిత, ఏఎన్ఎం భూదేవి,ఆశ కార్యకర్తలు రజని,పద్మావతి లు పాల్గొన్నారు.



## గాజులదిన్నె ప్రాజెక్టును ఐఆర్ఎస్ అధికారులు సందర్శన

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గాజులదిన్నె ప్రాజెక్టును శుక్రవారం ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి చింతరంజన్దాస్, జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సందర్శించారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం ఎంత, ప్రస్తుతం ప్రాజెక్టులో ఎంత నీరు నిలువ ఉంది. ప్రాజెక్టు కింద ఎన్నివేల ఎకరాలు సాగు కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఎన్నివేల ఎకరాల్లో సాగు అవుతుంది. ఏ సీజన్లో రైతులకు నీరు అందజేస్తారు అనే విషయాలను ప్రాజెక్టు అధికారులు డీఈ విజయ్‌కుమార్, ఏఈ మహమ్మద్ ఆలీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోడల్ స్కూల్ పరిధిలో గతంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను వారు పరిశీలించారు. ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలకు కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. ఇంకుడు గుంతలను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం జలజీవన్ మిషన్ ద్వార చేపట్టిన పనులను ఐరన్బండ గ్రామంలో వారు పరిశీలించారు. గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఐరన్బండ గ్రామంలో జలజీవన్ మిషన్ కింద పైప్లైన్ వేశామని ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ కూడా ఇవ్వడం జరిగిందని ఆర్డబ్ల్యుఎస్ అధికారులు తెలిపారు. అయితే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో నీటి విడుదల కావడం లేదని గ్రామస్థులు తెలిపారు. గోనెగండ్ల లోని ఎస్ఎస్ ట్యాంక్ నుంచి వచ్చే నీటిని మరింత పెంచి గ్రామానికి ఇవ్వాలని గ్రామస్థులు కోరారు. ఇందుకు స్పందించిన జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రెండు రోజుల్లో ఆర్డబ్ల్యుఎస్ అధికారులు గ్రామాన్ని సందర్శించి సమస్యను పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడ నీరు రావడం లేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పాఠశాలకు వెళ్లి కొళాయిలకు నీరు వస్తుందా లేదా అని తెలుసుకున్నారు. పాఠశాలకు నీరు సంవృద్ధిగా విడుదల చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ అమరానాథ్, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సోనిబాయిఏవో హేమలత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుకు 1912 టోల్ ఫ్రీ నంబర్

– విద్యుత్ శాఖ ఏఈ నరసన్న

**కౌతాళం, మేజర్‌న్యూస్:** విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుకు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని విద్యుత్‌శాఖ ఏఈ నరసన్న సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారులు ఇళ్లల్లో అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు, పరికరాలను నాణ్యత గల ఐఎస్ఐ మార్క్ కలిగిన వాటినే వినియోగించాలన్నారు. విద్యుత్ సర్వీసు కోసం వినియోగించే సర్వీసు వైరు నాణ్యమైన, లోడుకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎర్త్ పైపు రరా ఎర్తింగ్‌ఉ ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు (సపోర్ట్ వైర్లు) తాకరాదన్నారు. ఇల్లు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నప్పుడు దగ్గరలోని విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు ఉంటే విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. తడి చేతులతో గానీ తడి కాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లను వేయరాదన్నారు. ఇళ్లపై బట్టలు ఆరేసేటప్పుడు విద్యుత్ స్తంభాలు, తీగలకు దగ్గరలో ఉంటే అలాంటి ప్రదేశంలో బట్టలను ఆరబెట్టరాదన్నారు. తోటల్లో కానీ, పొలాల్లో కానీ ఇతర ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి ఉంటే వాటిని నేరుగా తాకరాదని, వెంటనే విద్యుత్శాఖ సిబ్బందికి లేదా 1912 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనిస్తే ఆ వ్యక్తిని గానీ, విద్యుత్ పరికరాన్ని గానీ నేరుగా తాకరాదన్నారు. వెంటనే దగ్గరలోని విద్యుత్ అధికారికి లేదా సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.

# డబ్బు కాదు నిందితులకు శిక్ష పడాలి


మాట్లాడుతున్న బోయ పులికొండన్న

**నంద్యాలఅర్బన్, మేజర్‌న్యూస్ :** వాసంతి మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డబ్బుతో కుటుంబాన్ని ఓదార్చి న్యాయం చేయలేరని ఎంవిఆర్పీఎస్, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం నంద్యాల పద్మావతి నగర్ ఆర్చి వద్ద ఎంవిఆర్పీఎస్, వామపక్షాలు, కుల సంఘాలు భారీగా మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంవిఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న మాట్లాడుతూ వాసంతి ఆచూకి కనుక్కోలేకపోవడం ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రోజుకొక సాకుతో కాలయాపన చేస్తూ బుధవారం ఇంకో కొత్త డ్రామాకు తెరలేపారని అన్నారు. శుక్రవారం ఇద్దరు మంత్రులు, ఎంపీలు వాసంతి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వడం ఆంతర్యమేంటని ప్రశ్నించారు. వాసంతి కుటుంబానికి రూ.50 లక్షలు, 5 ఎకరాల భూమి, ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని అన్నారు. అలాగే నిందితులను గుర్తించి శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అంటురోగాలపై జాగ్రత్తగా ఉండండి

**కోసిగి, మేజర్‌న్యూస్:** గ్రామాలలో అంటురోగాలు ప్రబలే అకాశాలున్నాయని వాటివల్ల జాగ్రత్తలు పాటించాలని తహశీల్దార్ మురళీ ప్రజలకు సూచిం చారు. శుక్రవారం నేలకోసిగి గ్రామంలో పంచాయితీ కార్యదర్శి వినోద్‌నాయక్, విఆర్ఓ బసవరాజు ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించారు. డ్రైనేజీ, పారుశుద్ధ్య పనులు పంచాయితీ సిబ్బంది చేపడుతున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకోవడం జరిగింది. పారుశుద్ధ్య పనులు చేపట్టి అంటురోగాలు ప్రభల కుండా తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అనుమంతమ్మకు తహశీల్దార్ సూచించారు. అలాగే ప్రజలు అంటు రోగాలపై జాగ్రత్తలు పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేలకోసిగి లక్ష్మన్న, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్.ఒ.సి.నెం.:315/2015/ఎ1 పురపాలక సంఘం, నంద్యాల

తేది:19.07.2024

## పత్రిక ప్రకటన

నంద్యాల పురపాలక సంఘమునకు సంబంధించి ఈ దిగువ తెలిపిన షాపింగ్ కాంప్లెక్సులలోని ఖాళీగా ఉన్న షాపు రూములను తేది:26.07.2024 ఉదయం:11గంటలకు పురపాలక సంఘ కార్యాలయం నందు జరుపబడునని తెలియజేయడమైనది. మరియు కమీషనర్ గారు లేదా వారి అనుమతి పొందిన అధికారిచే బహిరంగ వేలము పాట నిర్వహించబడునని కూడా తెలియజేయడమైన ది.

| వ. సం | షాపింగ్ కాంప్లెక్స్ పేరు | షాపు రూము నెం. |
|---|---|---|
| 1 | ఎస్.టి.ఆర్.కాంప్లెక్స్ | 03, 28, 35, 42, 47 |
| 2 | పాత మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ | 02, 03, 1ఎస్, 6ఎస్–7ఎస్, 8ఎస్ –9ఎస్ |
| 3 | మునిసిపల్ హైస్కూలు దగ్గర | 8, 11–12 (అప్‌స్టైర్) |
| 4 | ఆర్.ఎఫ్ రోడ్డు | 3 |
| 5 | న్యూ నాగులకుంట రోడ్ నెం. | 2 |
| 6 | సత్రంబడి | 01, 05 (అప్), 06 (అప్) |
| 7 | ఆర్ .టి.సి. బస్టాండ్ | 6–7 (అప్), 8–9–10 (అప్) |
| 8. | గర్ల్స్ హైస్కూల్ ప్రక్కన | 03, 04, 08, 09, 11 |
| 9 | న్యూ నాగులకుంట, ప్రతాప్‌టాకీస్ | 03, 05, 09, 11, 12 |
| 10 | డైలీ వెజిటబుల్ మార్కెట్ | 13 |

సదరు బహిరంగ వేలము నందు పాల్గొనదలచిన వారు ఇతర వివరముల కొరకు మునిసిపల్ కార్యాలయములోని రెవెన్యూ విభాగము నందలి ఎ1 గుమస్తాను పని వేళలలో సంప్రదించగలరు మరియు పాటలో పాల్గొనదలచిన వారు పాటకు 3 రోజుల ముందుగా సాల్వెన్సీని కార్యాలయములోని ఎ1 గుమాస్తాకు అందచేయవలసినదిగా తెలియజేయడమైనది.

కమీషనర్
నంద్యాల పురపాలక సంఘము.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర పాలక కంస్థ కమిషనర్ భార్గవతేజ తెలిపారు. శుక్రవారం నగరంలోని అన్ని సచివాలయ పరిధిలో ఆరోగ్య, శానిటేషన్ సెక్రటరీలు ఇంటింటికి వెళ్లినట్లు తెలిపారు. ఇండ్లలో, పరిసరాల్లో పాతటైర్లు, కొబ్బరిబొండాలు, కూలర్లు, బాటిళ్లలో నీటి నిల్వలు లేకుండా నీటిని పడబోశారన్నారు. పరిసరాల్లో, మరుగుకాలువల్లో హైపో క్లోరైడ్ ద్రావణం పిచికారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారన్నారు. ప్రజలు స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే 7422992299 హెల్ప్‌లైన్ నెంబరును సంప్రదించాలన్నారు.




# సాతనూరులో ఘర్షణ – ఇద్దరికి గాయాలు


మసీదులో గొడవపడిన ముస్లింలు

**కోసిగి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో ముస్లింల మధ్య ఘర్షణ శుక్రవారం చోటుచేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ చేసే సమయంలో సాతనూరుకు గ్రామానికి చెందిన ముతవల్లి ముల్లా ఖాసీం కుమారులు ఖాజా, రహిమత్‌వలి, జిలాన్, అబ్దుల్ అనేవారు నజీర్, నవాజ్‌లపై దాడిచేసి గాయపరిచినట్లు బాధితులు నజీర్, నవాజ్ విలేకర్లుకు తెలిపారు. వక్ఫ్‌బోర్డు పొలాలు వేలంపాటలో నజీర్, నవాజ్‌లు దిక్కించుకోవడంతో కక్షతో మాపై వారు దాడిచేశారని వారు ఆరోపించారు. వేలంపాటలో వక్ఫ్‌ఫార్డ్ భూములు ఎలా దక్కించుకుంటారని, మమ్మల్ని గొడ్డలితో నరికి చంపుతామని బెదిరించి దాడులు చేయగా నజీర్‌కు తలకు, వీపుభాగాన బలమైన గాయలయ్యాయి. అయితే నమాజ్ చేసే సమయంలో ముస్లింలు దాడులు చేసుకోవడం సరైన పద్ధతి కాదని ముస్లింలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం అందరూ ముస్లింలు పవిత్రతపాటించి నమాజ్ చేసుకునే దర్గాదగ్గర కూడా ఇలాంటి ఘర్షణలకు పాల్పడడం తగదని ముస్లింలు వాపోతున్నారు. దాడిచేసినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని బాధితులు నజీర్, నవాజ్‌లు కోరారు.

## వర్షానికి కూలిన మట్టిమిద్దె


వాపోతున్న దేదేకుల హుస్సేన్‌బీ

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని కొమ్మెమర్రి గ్రామంలో మట్టి మిద్దె కూలిపోయింది. వివరాలలోకి వెళితే గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్‌బీ నివాసం ఉంటున్న మట్టిమిద్దె 18వ తేది రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. దీంతో రూ.5లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వాపోయింది.

# పశువుల మృత్యువాత

## వారం రోజుల వ్యవధిలో డజనుకు పైగా మృతి చెందిన మూగజీవాలు


మృత్యువాత పడిన ఆవు దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు సుంకన్న

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** దాదాపు వారం రోజుల వ్యవధిలోనే సుమారు డజనుకు పైగా మూగజీవాలు మృత్యువాతపడిన ఘటన మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని మజరా గ్రామమైన వెంకటాంపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. అదే విధంగా గ్రామానికి చెందిన సుంకన్నకు చెందిన రెండు ఆవులు సైతం మృత్యువాత పడటంతో, సుమారు రూ.70వేలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. వరుసగా వారం రోజుల వ్యవధిలోనే దాదాపు డజనుకు పైగా మూగజీవాలు మృతి చెందినా కూడా పశువైద్యాధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. అస్సలు పశువైద్యాధికారులు ఎప్పుడు గ్రామానికి వస్తారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదని, గ్రామంలో మూగజీవాలు మృత్యువాతపడుతున్న పశువైద్యాధికారులు స్పందించకపోవడం దారుణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పశువులు చనిపోతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఒకవేళ పశువైద్యాధికారులు పశువుల ఆరోగ్యానికి వ్యాక్సిన్‌లు వేస్తే అవి మరుసటి రోజు పనిచేయడం లేదని, దీంతో పశువులు చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున జిల్లా స్థాయి పశువైద్యాధికారులైనా కాస్త మా గ్రామంపై దయఉంచి, మృత్యువాత పడుతున్న పశువులను కాపాడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్:** కర్నూలు నగర పరిధిలోని బసిపాడు, చిన్నటేకూరు, తడకనపల్లె వామసముద్రం, బొల్లవరం, పుసులూరు, రేమదూరు, గార్గేయపురం, మిలటరీ కాలనీ, నూతనపల్లె, వెంకాయపల్లె, దిగువపాడు, పూడూరు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఎస్‌పీడీసీఎల్ రూరల్ డీఈఈ సుబ్బన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నటేకూరు, మిలటరీ కాలనీల్లోని 33/11కెవి సబ్‌స్టేషన్ పరిధిలో పనులు జరుగుతుండటంతో అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సూర్య
శనివారం | 20 జులై 2024

# సనాతన ధర్మం ఎంతో గొప్పది

- టీటీడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి
- రాంపురంలో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** సృష్టి ఆరంభం నుండి ఏ ధర్మం ఆచరణలోకి వస్తుందో అదే సనాతన ధర్మమని, సమాజాన్ని అంతటినీ కలిపి ఉంచేదే ధర్మమని, మన మహర్షులు ఆచరించి, మనకు అందించిన ఈ ధర్మమే శ్రేష్టమైన ధర్మమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం నందు


కొలువైన శ్రీసీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్లు, కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, , గోపూజ చేస్తున్న భక్తులు

అర్చకులు లింగేశ్వర, కంచి రాంప్రతాప్‌లు భక్తులందరితో గోపూజ, కుంకుమార్చనలు చేయించారు. అనంతరం వారు సనాతన ధర్మాన్ని గురించి ప్రజలకు వివరించారు. గత నాలుగు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై డాక్టర్ దేవి దయానంద్‌సింగ్ చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. అనంతరం స్వామి వారి ప్రసాదం అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపమండలాధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు, ఎస్.నాగిరెడ్డి, కృష్ణమూర్తి, ఆదినారాయణ, మనోహర్, నరేష్, ఓబులరెడ్డి, శ్రీనివాసులు, రంగన్న, రమేష్, జయరంగయ్య, నాగభూషణం, పెద్ద సంఖ్యలో భక్తులు, చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జ్ వీసీగా ప్రొఫెసర్ పిఎస్.షావలిఖాన్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ పిఎస్.షావలిఖాన్ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో బాటని విభాగం అధిపతగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జహనారా, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


బాధ్యతలు చేపడుతున్న పిఎస్.షావలిఖాన్

## శ్రీ చౌడేశ్వరీదేవి పల్లకి సేవ


అమ్మవారి పల్లకీసేవ దృశ్యం

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** నందవరం శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి పల్లకిసేవను శుక్రవారంనాడు సాయంకాలం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈ.వొ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించి అందంగా అలంకరించిన అనంతరం పల్లకీ నందు కూర్చొబెట్టి ప్రధాన రాజగోపురం చుట్టూ అమ్మవారి పల్లకి సేవను నిర్వహించడం జరిగింది. పల్లకీసేవ అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## కష్టపడితే ఏ రంగంలోనైనా రాణించవచ్చు

– కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** కష్టపడితే ఏ రంగంలోనైనా మంచి ఫలితాలు సాధించవచ్చని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ బాలికల, టౌన్‌మోడల్ ప్రభుత్వ కళాశాలల్లో నిర్వహించిన ఉచిత నోట్ బుక్‌లు, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న తాను ఎంతో కష్టపడి ఎంపీని అయ్యానని, మీరు కూడా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని వటిని సాధించేందుకు శ్రమించాలన్నారు. ఇక బాగా చదువుకొని జన్మనిచ్చిన తల్లిదండ్రులు, చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్, టౌన్‌మోడల్ కళాశాలల ప్రిన్సిపాల్స్ లాలెప్ప, సుంకన్నతోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.


బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

## అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్టర్ కార్యాలయాలు అవినీతి, అక్రమాలకు అడ్రస్‌గా మారాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, బాధితుడు అయ్యన్న ఆరోపించారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలోని రిజిస్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నయ్యకు చెందిన భూమిని ఎలాంటి ఆధారాల లేకుండా అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న రిజిస్ట్రర్‌లను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు దస్తగిరి, రాఘవేంద్ర, గౌతమ్, హుసేన్‌బాష, మహేష్, శివశంకర్, శంకర్ పాల్గొన్నారు.

### విధులకు డుమ్మా కొట్టిన

## రాంకొండ సచివాలయం ఉద్యోగులు

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** తుగ్గలి మండల పరిధిలోని రాంకొండ గ్రామ సచివాయలంలో శుక్రవారం పలువురు సచివాలయ ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టడంతో వివిధపనులపై సచివాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం 4గంటల సమయంలో కేవలం హెల్త్ కార్యదర్శి మాత్రమే సచివాలయంలో విధుల్లో ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టారు. అయితే కొందరు ఉద్యోగులు విధులకు హాజరైనట్లు హాజరు పట్టికలో సంతకాలు చేసినట్లు అక్కడ ప్రజలు తెలిపారు. ప్రతి నెల వేలకు వేలు జీతాలు తీసుకుంటూ విధులకు హాజరుకాకపోవడం ఏమిటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విధులకు డుమ్మా కొడుతున్న సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకొని ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


రాంకొండ గ్రామ సచివాలయం

ఈ విషయంపై తుగ్గలి మండల ఎంపీడీవో విజయమ్మను వివరణ కోరగా.. విధులకు హాజరు కాని ఉద్యోగులపై విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## విద్యార్థులు దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలి


విద్యార్థినిలతో డాక్టర్ శంకర్‌శర్మ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** విద్యార్థులు కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకుండా దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని భాష్యం పాఠశాలలో శుక్రవారం జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ఆయా రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచాలన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా యువత మన దేశంలో ఉన్నారన్నారు. మన దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి జీవితంలో ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

## గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు

– శింగవరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం

**బండిఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** గ్రామాలలో రక్తహీనత గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య సేవలు అందజేయాలని జిల్లా ఇంచార్జి ప్రోగ్రాం మానిటరింగ్ అధికారిణి డాక్టర్ సునీత తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆరోగ్య ప్రసూతి కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రామింగ్ అధికారిణి డాక్టర్ నవీన్, జిల్లా డేటా మేనేజర్ శివకుమార్‌లతో కలిసి పరిశీలించారు. విలేజ్ హెల్త్ క్లీనిక్ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వారు ఆరా తీశారు.


డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా డ్రైనేజీ పరిశీలిస్తున్న డాక్టర్ సునీత

గ్రామాలలో వైద్య సిబ్బంది గర్భవతి మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చిన్న పిల్లల రక్తహీనత గుర్తించి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఇంచార్జి ప్రోగ్రాం మానిటరింగ్ అధికారిణి డాక్టర్ సునీత

అలాగే కుష్టువ్యాధి రోగులను గుర్తించి వారికి మందులు అందజేయాలని సూచించారు. అనంతరం విలేజ్ హెల్త్ క్లీనిక్‌లోని డిపార్ట్‌మెంటులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో పాటు గ్రామంలో పర్యటించి లార్వ నిల్వ లేకుండా చూడాలని నీరు నిలబడిన చోట వేస్తు ఆయిల్ చల్లాలని సూచించారు. వీరితో పాటు ఎంపీహెచ్ఎస్ మల్లమ్మ, ఎం.ఎల్.హెచ్.పీ జ్యోతి ఏ.ఎన్.ఎం బాల హుసేనమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఆలూరు నియోజకవర్గంలో

# రోడ్లు, తాగునీటి సమస్యపై దృష్టి పెట్టండి

**జడ్పిటిసి నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన విరుపాక్షికి సన్మానం చేసిన జడ్పి చైర్మెన్, జడ్పిటిసిలు**



ఎమ్మెల్యే విరుపాక్షికి సన్మానం చేస్తున్న జడ్పిటిసిలు

**ఆలూరు, మేజర్‌న్యూస్:** ఆలూరు నియోజకవర్గం లో రోడ్లు నీళ్ల సమస్య తీవ్రంగా ఉండడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విరుపాక్షి జిల్లా కలెక్టర్, జడ్పి సీఈ ఓ లను కోరారు. శుక్రవారం కర్నూల్ జిల్లా పరిషత్ లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ముఖ్యంగా ఆస్పరి మండలంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండడం వల్ల ప్రజల అవస్థలు పడుతున్నారని వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించండని కోరారు. అదేవిధంగా పాత ప్రాజెక్టులు పరుగులు పెట్టించాలని వాటిలో చిప్పగిరి మండలంలోని



జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

నగరడోన రిజర్వాయర్,వేదావతి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి అదేవిధంగా హంద్రీనీవా నుండి తూము ఏర్పాటుచేసి ఏబిసి కెనాల్ కు సకాలంలో నీళ్లు అందించాలని అన్నారు. వర్షాకాలం మొదలయ్యే లోపు నియోజకవర్గం లో ఉండే అన్ని రోడ్లకు మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చాలని కోరారు. ఎమ్మెల్యే విన్నపం మేరకు మంత్రి భరత్ మరియు కలెక్టర్ రంజిత్ భాష లు ఎమ్మెల్యే తెలిపైన సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జడ్పిటిసి లు, జడ్పి చైర్మన్ పాపిరెడ్డి లు విరుపాక్షికి సన్మానం చేశారు. జడ్పిటిసిగా ఉన్న విరుపాక్షి ఎమ్మెల్యే గా గెలుపొందడం ఎంతో ఆనందంగా ఉందని విరుపాక్షి మరెన్నో పదవులు పొందాలని దేవున్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి లు చంద్రశేఖర్, దొరబాబు, కిట్టులు, ఎంపీపీ లు పాల్గొన్నారు.

# గ్రామాలలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

### – ఎంపీడీవో విజయరావు

**బండిఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్ని గ్రామాలలో డ్రైనేజీ సమస్యలు లేకుండా పరిష్కరించాలని బండిఆత్మకూరు ఎంపీడీవో విజయరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ గురువారం పర్యటన అనంతరం డ్రైనేజీ సమస్యలపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళే మార్గంలో డ్రైనేజీ పనులు చేపట్టారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యలు లేకుండా, నీటి నిల్వలు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి నటరాజ్‌కు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయరావు



ప్రభుత్వ ఆసుపత్రిలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

ఉన్న పిచ్చి మొక్కలను ఉపాధి హామీ ఏపీవో జయసుధ తమ సిబ్బందితో పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను పరిశీలించి ఎర్రగుంట్ల, ఏ.కోడూరు గ్రామ సచివాలయాలను ఎంపీడీవో సందర్శించారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. వీరితో పాటు ఏవో హనీఫ్, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ భవనారెడ్డి, డాక్టర్ సరిత,ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు జిక్రియా, ఆచారి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

# హెల్మెట్ తప్పనిసరి

### – ర్యాగింగులు వద్దు... చదువే ముద్దు

### – విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** హైకోర్టు తీర్పు మేరకు ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాల్సిందేనని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి, లీగల్ ఎయిడ్స్ డిఫెన్స్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ స్పష్టం చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలోని సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ వద్దని చదువు ముద్దని వారు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే చట్టరీత్యా శిక్షార్హులవుతారని వారు చెప్పారు. హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదం జరిగినా ప్రాణాపాయం తప్పే అవకాశం ఉంటుందని గుర్తించాలని వారు చెప్పారు.

# రషీద్ హత్య గత ప్రభుత్వ నిర్లక్ష్యమే

### – మంత్రి ఎన్ఎండి ఫరూక్

### – బాధితుడు, నిందితుడు వైసీపీలో కలిసి తిరిగినవారే

### – రెండేళ్ల క్రితమే ఇద్దరికి గొడవ

### – దీనిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** పల్నాడు జిల్లా వినుకొండలో రషీద్ హత్య గత పాలకుల పాప ఫలితమేనని ఏపీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విమర్శించారు. నిందితుడికి, బాధితుడికి మధ్య జరిగిన గొడవను మొదట్లోనే అణచి వేసి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదని ఫరూక్ అన్నారు. మృతుడు రషీద్, నిందితుడు జిలానీ ఇద్దరూ గతంలో వైసీపీలో కలిసి తిరిగారని అన్నారు. రెండుళ్ల క్రితం మొహర్రం సందర్భంగా మద్యం సేవించి గొడవపడ్డారని తెలిపారు. తరువాత వారంతా జిలానీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను గాయపరిచి ద్విచక్ర వాహనం తగలబెట్టినప్పుడు పోలీసులు కఠినంగా వ్యవహరించి ఉంటే పరిస్థితి ఇప్పుడు ఇంత వరకు వచ్చి ఉండేది కాదని అన్నారు. ఇలాంటి ఘటననే ఎన్నికలకు ఆరు నెలల ముందు నంద్యాలలో జరిగిందని అక్కడ పట్ట పగలు హత్య జరుగుతుంటే అందరు చూస్తూ ఊరుకున్నారని అన్నారు. ఎవరూ అడ్డు పడలేదని గుర్తు చేశారు. ఎన్నికల ముందు జిలానీ టీడీపీలోకి వచ్చినంత మాత్రానా హత్యను పార్టీకి అంటగట్టడం, ముఖ్యమంత్రి ఇందుకు బాధ్యత వహించాలని అనడం సరికాదని అన్నారు. శిక్షించే విషయంలో పార్టీలు చూడబోమని ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని అన్నారు.

### టీడీపీలో చేరిన

# పారుమంచాల వైసీపీ నాయకులు

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** మండలంలోని పారమంచాల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీలో చేరారు. శుక్రవారం కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్ష్యంలో వైసీపీ నాయకులు పోచా రాఘవరెడ్డి, స్వామి రెడ్డి, శంకర్‌రెడ్డిలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ లాలు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డి సమక్ష్యంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

### ఆలూరు తెదేపా ఇంఛార్జిగా

# సమర్థవంతమైన నాయకుడికి పట్టం కట్టండి

- సీనియర్లను విస్మరిస్తే పార్టీ మనుగడ కష్టం
- జిల్లా తెదేపా అధ్యక్షుడికి విన్నవించిన ఆలూరు తెదేపా నాయకులు

**ఆలూరు, మేజర్‌న్యూస్:** కర్నూల్ జిల్లాలో ఆలూరు నియోజకవర్గం వెనుకబడి ఉందని గత ఎన్నికల్లో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడినా ఓటమి చెందారని దానికి పార్టీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ స్వయంకృతపరాధమే అని జడ్పిటిసి ల సంఘం మాజీ అధ్యక్షులు మీనాక్షి నాయుడు,మండల కన్వీనర్లు తిప్పయ్య, విజయ్ గౌడ్,అశోక్ యాదవ్, సుధాకర్, ఎంపిటిసి రజని, సీనియర్ నాయకులు శేషగిరి, మాజీ జడ్పిటిసిలు ఉచ్చీరప్ప,రామలింగారెడ్డి విష్ణు, వెంకటేశ్ లు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డికి విన్నవించారు. ఎన్నికల కౌంటింగ్ అయిన తర్వాత ఒక్క మండల కన్వీనర్ కు కూడా పోన్ కానీ కలిసి మాట్లాడిన సందర్భం లేదని అన్నారు. తన ఓటమికి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అబాండాలు మోపడం సరికాదని అన్నారు. తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్క నాయకుడిని, కార్యకర్తలను కులం పేరుతో దూషించడం సభబు కాదన్నారు. 2019 నుండి 2024 వరకు పార్టీ



జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆలూరు టీడీపీ నాయకులు

కార్యక్రమాలకు దూరంగా ఉన్న వీరభద్ర గౌడ్ 2019 ఎన్నికల్లో పార్టీకి ఎలా ద్రోహం చేశారో టిడిపి కార్యకర్తలకు తెలుసు అని చంద్రబాబు సామాజిక వర్గ సమీకరణలో భాగంగా వీరభద్ర గౌడ్ కు టికెట్ మళ్లీ కేటాయించినా ఉన్న తక్కువ సమయంలో పార్టీ సీనియర్లను కలుపుకోకుండా ఒంటెత్తు పోకడ అవలంభించారని అన్నారు. పార్టీకి చెందిన మాజీ జడ్పిటిసి, ఎంపిపిలను కలవకుండా కేవలం అహంకారంతో విర్రవీగారని అన్నారు. అయినా ఆలూరు టీడీపీ నాయకులు,కార్యకర్తలు కేవలం చంద్రబాబు ను చూసి ఓట్లు వేశారని వీరభద్ర గౌడ్ ను చూసి కాదని అది గుర్తించుకోవాలన్నారు. అయినా ఎవరిదగ్గర కలవకపోయినా ఆలూరు ప్రజలు భారీగా ఓట్లు వేశారని తక్కువ మెజారిటీతో ఓటమి చెందారన్నారు. కావున ఆలూరు ఇంచార్జ్ భాద్యతలు సమర్థవంతమైన నాయకుడికి పగ్గాలు కట్టబెట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేష్ చౌదరి, ప్రవీణ్, మారుతి, జలందర్, ఉసేని, శ్రీరాం జయరాం, రామాంజనేయులు, సతీష్, తోక వెంకటేష్, భీమా, రామారావు, వెంకటస్వామిగౌడ్, రంగడు, సురేష్, కొండా పురుషోత్తం, సర్పంచ్ యల్లప్ప, చంద్ర, ముత్యాల రెడ్డి, మస్తాన్ లు పాల్గొన్నారు.



ఆలూరు నుండార్యాలీగా వెళ్తున్న టీడీపీ నాయకులు

సూర్య



# గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు చేపట్టాలి



ఎంపీడీవోల తో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గం లోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఎంపీడీవోలతో అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగాఆమె మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. గ్రామాలలో పరిసరాలు శుభ్రంగా లేకపోతే వర్షాకాలంలో రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. మండలాలకు సంబంధించి ఎలాంటి నిధులు అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకొని వస్తే ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడతామన్నారు. ఉపాధి హామీ పథకాల కింద పళ్ళతోటలకు, పూల తోటలకు అర్హులైన రైతులందరికీ సబ్సిడీ మంజూరు చేయాలన్నారు. మూడు నెలలకు ఒకసారి మండల హెడ్ క్వార్టర్ లో జడ్పిటిసి, ఎంపిటిసి పంచాయతీరాజ్ వారితో సమావేశం ఏర్పాటు చేసుకొని వారి సమస్యలు తెలుసుకుని తమ దృష్టికి తీసుకుని రావాలి అన్నారు. పంచాయతీరాజ్ శాఖ వారికి సంబంధిత గేట్ వసూళ్ళు, వారం సంతలు, డైలీ మార్కెట్ వంటి విషయాల్లో ఎక్కువ వసూలు చేయకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా పంచాయతీలో ఎంతైతే ఉందో అంతే వసూలు చేయాలని భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# తల నీలాల ప్రదర్శన

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన చాగలమర్రిలోని జామీయా మస్జీద్ ప్రక్కనే ఉన్న ఆసారే షరీఫ్ నందు భద్ర పరచిన ఇస్లాం మత ప్రవక్త హజ్రత్ మహమ్మద్ రసూల్ అల్లా వారి తల నీలాలను శుక్రవారం నిర్వాహకులు సయ్యద్ లాలామియ్య షా ఖాద్రీ ప్రదర్శించారు. మొహర్రం నెలలో కర్బలా మైదానంలోజరిగిన యుద్ధంలో వారి మనువళ్ళు శత్రువుల చేతిలో వీరమరణంలో పోందారు. వారిని స్మరించే ఉద్దేశంతో 10 రోజుల పాటు నిర్వహించిని వేడుకల ముగింపు సందర్భంగా ప్రవక్తను కూడా స్మరిస్తూ శుక్రవారం ఆసారే షరీఫ్ నందు ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించి తలనీలాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఖాజీ ఖమురుద్దీన్, గ్స్ వారి కుటుంబికులు పాల్గోన్నారు.



తల నీలాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

# త్రాగునీటి సమస్య పై గరం..గరం..



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ .భరత్



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ అండ్ బి శాఖ మంత్రి జనార్ధన్ రెడ్డి



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్

(మొదటిపేజి తరువాయి..)

సమావేశంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఉమ్మడి కర్నూలు జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, జయ సూర్య, బొగ్గుల దస్తగిరి, బివి. జయ నాగేశ్వర్ రెడ్డి,కేఈ శ్యాంబాబు, పార్థసారథి, వైసీపీ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ, కర్నూలు నంద్యాల జిల్లాల కలెక్టర్లు రంజిత్ భాష, రాజకుమారి, జడ్పీ సీఈఓ జి. నాసర రెడ్డి, డిప్యూటీ స్పీకర్ సుబ్బారెడ్డి, జెడ్పిటిసిలు, ఎంపీపీలు, జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ ఎర్రబాతులపాపరెడ్డి అజెండా అంశాలైన వ్యవసాయము, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, ఇరిగేషన్, విద్యుత్‌శాఖలనుశాఖలకుసంబంధించి ఆయా శాఖల అధికారులను నివేదిక ప్రవేశపెట్టాలని తెలిపారు. ఆయా శాఖల ప్రగతి నివేదికలను ఉన్నతాధికారులు ప్రవేశపెట్టారు.

**సుంకేశ్వరి గ్రామ ఘటన బాధ్యత ఎవరిది.? మంత్రి టీజీ భరత్ :** మంత్రాలయం మండలం సుంకేసరి గ్రామంలో డయేరియా వల్ల ఒక పాప మృతి చెందిందని, 84 మంది ఆసుపత్రి పాలయ్యారని, ఇందులో ఏం తేల్చారని ఎస్సీని ప్రశ్నించారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం లోపల లోపం వల్లే ఘటనకు కారణమని. దీనికి దీనికి బాధ్యులు ఎవరన్నారు. ఇలాంటి ఘటనలో మళ్ళీ పునరావృతం కారాదని ఆదేశించారు. ఆర్ డబుల్ ఎస్ సి మాట్లాడుతూ గ్రామంలో నీటి పరీక్షలు చేయించామని అందులో రిపోర్టు నెగిటివ్‌గా వచ్చిందన్నారు. డయేరియా ఫాస్టా ఫ్లడ్ కావడం వల్ల సమస్య పెద్దదైందన్నారు.

**బ్లాక్ మార్కెట్‌కి తరలుతున్న విత్తనాలు: ఎమ్మెల్యే పార్థసారథి :** రైతే భరోసా కేంద్రాలు భవనాలు తప్ప సేవలు రైతులకు అందడం లేదు. రైతులకు విత్తనాలు ఎరువులు సూచనలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రధానంగా ఆదోని ప్రాంతంలో మళ్లీ విత్తనాల సమస్య ఉందని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. విత్తనాలు బ్లాక్ మార్కెట్ కు తరలకుండా చూడాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు.

**కౌలు రైతు పేరుతో నిధులు స్వాహా .. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చెరుతారెడ్డి :** గడివేముల మండలం కరిమద్ధ్యల గ్రామంలో కౌలు రైతుల పేరుతో వైసీపీ నాయకులు నకిలీ ఆధారాలు చూపి 13,500 రైతు భరోసా నిధులు 4పొందారు. గడివేముల మండలంలో నాలుగు గ్రామాల్లో ఆర్డబ్ల్యాస్ నిధులతో నాసిరకం పనులు చేయడంతో ఇప్పటికే దెబ్బతిన్నాయి. ఉరకల మండలంలో చాలా గ్రామాలు ఇదే పరిస్థితి ఉంది.

**వ్యవసాయం పై ఎవరెమ్మన్నారంటే.. :** ఓర్వకల్ జడ్పిటిసి మాట్లాడుతూ వరి సాగు 250 ఎకరాల్లో జరుగుతుంటే ఒక రైతుకు ఒక ప్యాకెట్ మాత్రమే విత్తనం అందిస్తే ఎలా జరుగుతుందని రైతుకు సరిపడా అందించాలని కోరారు. అస్పరి జడ్పిటిసి మాట్లాడుతూ 26 వేల మంది రైతుల సప్సిడి లో 3 వేల మంది రైతులకు సప్సిడి రాలేదని కేవలం వ్యవసాయ అధికారులు తప్పుగా వివరాలు నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ మొత్తం జిల్లాలో పంట నష్టం సప్సిడి రైతుల వివరాలు ఆధారాలతో పాటు అన్ని సిద్ధం చేయాలని అందరికి సక్రమైన నమోదు నిర్వహించి అందరికి సప్సిడి అందేలా చూడాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ వెలుగోడు ప్రాజెక్టు పూర్తి అయిందని చెప్పి వెలుగోడు గ్రామానికి నీళ్లు ఇవ్వని దుస్థితి ఉంది. అక్కడ కనీసం మోటార్లు కూడా ఏర్పాటు చేయని పరిస్థితి వల్ల ఉందన్నారు. అప్పటి ప్రభుత్వంలో హడావిడి చేశారు తప్ప ఎక్కడ చుక్క నీటిని తాగడానికి ఇవ్వలేదని విమర్శించారు. హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏల్. కె తండాలో అందరూ ఎస్టీలు ఉన్నారు పైప్ లైన్ పోయి తాగడానికి నీళ్లు లేకుంటే కనీసం మరమ్మత్తులు చేయలేదు అధికారులు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు పశ్చిమ ప్రాంతం తాగునీటి కి కష్టాలు పడుతుందని ఇన్ని నీళ్లు ఉన్న తాగడానికి చుక్క నీరు లేకుండా ఉన్నాయని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అధికారుల వెంట నెల రోజులు తిరిగి ప్రజల దాహార్తి తిరుస్తానన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ ఆలూరు,అస్పరి ,హాలహర్వి మండలాల్లో తాగడానికి నీరు లేక నెల రోజులు ఒకసారి కూడా లేవని నీరు ఉన్న కనీసం దాహం తీర్చుకోవడానికి కిలో మీటర్ల దూరం పొలాల్లో వెళ్లి తెచుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని నీటిపారుదల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు ఉండి కూడా తాగడానికి సరఫరా చేయడానికి ఎందుకు ఇబ్బందులు అలా కుదరదు రేపే వెళ్లి అన్ని గ్రామాలు తనిఖీ చేసి పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి అలాగే శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా ఎస్.ఎస్ ట్యాంక్ నిర్మాణాలు ఎక్కడ చేపట్టాలి అనేది పరిశీలించి నివేదిక ఇస్తే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**జలజీవన్ సమస్యపై ఆగ్రహించిన మంత్రి బి.సి :** జలజీవన్ మిషన్ పనుల్లో ఎక్కడ కూడా పనులు పూర్తి కాలేదని ఓట్ల కోసం సొమ్ము చేసుకోవడం కోసం నాసి రకం పనులు చేశారు. ఆ పైపులు,ఎక్కడ ఉన్నాయి ఎవరిదగ్గర ఏ నాయకుని ఇళ్లల్లో కాంట్రాక్టర్ల ఇళ్లల్లో ఉన్నాయో ఆధారాలతో బయటపెడతామని దీనిపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్యేలు అందరూ ముక్తకంఠంతో జలజీవన్ మిషన్ పనుల్లో అన్ని చోట్లా అదే తంతు కొనసాగిందని విచారణ జరిపి అధికారులు, కాంట్రాక్టర్ల తప్పు ఉంటే తగిన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి సమస్య ఉమ్మడి జిల్లాలో తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రులు ఫరూక్,బి.సి ఆదేశించారు. చైర్మన్ ఎరబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ సిడబ్ల్యుసి స్కిం కింద జిల్లా పరిషత్ పరిధిలో 80 కోట్ల నుండి 85 కోట్లు ఖర్చు అవుతుందని మనకు కేవలం 25 కోట్లు మాత్రమే వస్తుందని ఈ ప్రభుత్వంలో 80 కోట్ల నిధులు వచ్చేలా తీర్మానం చేసి మంత్రుల ద్వారా నివేదించాలని తీర్మానం చేశారు.

**నీటిపారుదలశాఖ పై చర్చలో.. :** పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు మాట్లాడుతూ పత్తికొండ పరిధిలో 68 చెరువుల నింపకంలో పూర్తి చేశామని గత ప్రభుత్వం ప్రారంభించారు. అయితే కనీసం ఎక్కడ పూర్తి కాలేదని అన్ని పైపు లు పగిలిపోయి రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇరిగేషన్ ఎస్.ఈ రెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ 30 చెరువులకు నీటిని అందించడం జరిగిందని అప్పటి వాతావరణం వల్ల నీరు సమృద్ధిగా లేనందున మిగతా వాటికి నింపలేదని ప్రస్తుతం శ్రీశైలం నీటిమట్టం పెరిగితే నింపుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టు,గాజులదీన్నె ప్రాజెక్టు ఆర్డీఎస్ కాలువ పనులు ఏమయ్యాయి ఎప్పటికి పూర్తి చేస్తారు. ప్రస్తుతం గాజులదీన్నె ప్రాజెక్టు ఎత్తు మళ్ళీ ఒక మీటర్ పెంచారు. ఉన్న 3.5 టీఎంసీ నీటిని పూర్తిగా వాడుకోలేదు మళ్ళీ పెంచారు. దానివల్ల గేట్లు ఎత్తలేక నీరు వెనక్కొచ్చి రైతుల పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఎస్.ఈ మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టు రెండు రాష్ట్రాల సమస్య అని 2600 కోట్లకు డిపిఆర్ పంపించడం జరిగిందని అది రాష్ట్ర స్థాయి సమస్య అన్నారు. బి.సి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు కి లైనింగ్ వర్క్ చేయడం అంత నీచమైన పని ఇంకెకటి ఉందా ?అది అధికారులకు తెలుసు ఎవరి మెప్పు కోసం అలా ఇక్కడి రైతుల గొంతు కోశారు. పైగా నాణ్యత లేని పనులు చేశారు. దీనిపై పూర్తి విచారణ కమిటీ వేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి బి.సి.,చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ జెడ్పి పాత బిల్డింగ్ భవనం 100 ఏళ్ల చరిత్ర కలిగిందని దానికి టూరిజం శాఖ వారు మరమ్మతులు చేసి వినియోగిస్తారని తెలిపారు. అయితే కాళీ స్థలానికి 7 రూపాయలు, కట్టడం ఉన్న బిల్డింగ్ కు 15 రూపాయలు చొప్పున ఇవ్వాలని కోరాము. అందుకు అందరి సభ్యులుతీర్మాణం చేస్తే ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి కృష్ణ బోర్డు కర్నూల్ లోనే పెట్టాలని ఆ తీర్మానం కూడా చేయాలని పట్టుబట్టారు. అందరూ ఎమ్మెల్యేలు అందుకు ఏకీభవించడంతో కృష్ణ బోర్డు కర్నూలు లో కృష్ణ నది పరివాహక ప్రాంతం ఇక్కడే ఉంది ఇక్కడే పెట్టాలని తీర్మానం చేశారు.



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు





సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు,

# శిల్ప కళాకారులకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం

**శిల్ప కళాకారుల అభివృద్ధికి ఎప్పుడు ముందుంటా**



**ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సన్మానిస్తున్న దృశ్యం**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్** :ఆళ్లగడ్డలో శిల్ప కళాకారుల కోసం మంత్రుల తో మాట్లాడి కమ్యూని టీ హాలు నిర్మించేందుకు కృషి చేస్తామని, శిల్ప కళాకారులఅభివృద్ధికితాను ఎల్లప్పు డూ తోడుంటానని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. పట్టణంలోని ఆమె స్వగృహంలో ఆళ్లగడ్డ శిల్ప కళాకారులు శుక్రవారం తరలివచ్చి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్ప కళాకా రులను ఉద్దేశించి మాట్లాడుతూ తాను శిల్పకళాకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ లను నెరవేరుస్తామన్నారు. రోడ్డుకు ఇరువైపులా శిల్పకళామందిరాలు ఎక్కువగా ఉండడం వలన ఇరువైపులా శిల్పకళా నగర్ అని ఆర్చిలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే శిల్పాలు చేయడానికి రాయి రవాణా ఖర్చులు ఎక్కువగా వస్తున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా రవాణా పైన అసెంబ్లీలో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.రెండు రాష్ట్రాల్లో శిల్పాలంటే గుర్తుకు వచ్చేది ఆళ్లగడ్డ అని ఆళ్లగడ్డ శిల్ప కళాకారుల గురించి అసెంబ్లీలో చర్చించి శిల్పులు అందరికీ ఐడి కార్డ్స్ ఇప్పిస్తానన్నారు. తద్వారా శిల్పులు అందరూ కమిటీ లాగా ఏర్పాటు చేసి శిల్ప కళాకారుల అభివృద్ధికి తానెప్పుడూ తోడుగా ఉంటానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ శిల్పులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్



**ముళ్ల పొదల మధ్య విద్యుత్ ట్రాన్స్ఫార్మర్**

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మండల కేంద్ర మైన గోనెగండ్లలోని పాలబస్టాండ్ ప్రాంగ ణం నందు ఎస్బీఐ బ్యాంక్ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకంగా మారింది. ట్రాన్స్ఫార్మర్కు రక్షణ గోడ లేక పోవడం చుట్టు ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు మొలకెత్తడంతో ఎప్పుడు ప్రమా దం జరుగుతుందో అర్థం కావడంలేదని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. మొక్కలు పెరగడంతో మూగజీవా లు వాటిని తినేందుకు వెళ్లి ప్రమాదం బారి పడేఅవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైె విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్ఫార్మర్కు రక్షణ గోడ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఆరు మంది క్రైమ్ కానిస్టేబుల్ బదిలీ



**కర్నూల్ క్రైం,మేజర్న్యూస్ :** కర్నూల్ సబ్ డివిజన్లోని.కర్నూల్ అర్బన్ నాలుగో పట్టణ పిఎస్ పరిధిలో.కానిస్టేబుల్గా పనిచేస్తున్న ఆరుమందిని..అవినీతి ఆరోపణల కారణంగా. జిల్లా ఎస్పీబిందుమాధవ్.బదిలీచేస్తూ శుక్రవారం ఉత్తర్వు లు జారీ చేశారు.ఏఎస్ఐ భాస్కరరాజు. కర్నూల్ అర్బన్ పిఎస్ నుండి జొన్నగిరి పిఎస్కి.హెడ్ కానిస్టేబుల్ రామకృ ష్ణ అర్బన్ పిఎస్ నుండి చిప్పగిరి పిఎస్ కి.హెడ్ కానిస్టే బుల్ లక్ష్మీనారాయణ అర్బన్ పిఎస్ నుండి మంత్రాలయ ం పిఎస్కి.నాలుగో పట్టణ పీఎస్లో పనిచేస్తున్న కే నాయ క్ను. పెద్ద తుంబలం పిఎస్కు. నాలుగో పీఎస్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్ డి.గోవిందును మద్దికేర పిఎస్ కు బదిలీ చేశారు.

# విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** ఎడతెరిపిలేని వర్షాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ షాజహాన్ సూచించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తడి చేతులతో విద్యుత్తు తీగలను, స్తంభాలను తాకరాదని ఇంట్లో కరెంటు సరఫరా చేయడంలో అప్రమ త్తంగా ఉండాలన్నారు.ఎక్కడైన విద్యుత్ తీగలు వ్రేలాడుతుం టే వెంటనే కరెంట్ ఆఫీస్లో తెలియజేయాలన్నారు.అలాగే తడిసిన కరెంట్ స్థంబాలను, విద్యుత్ మీటర్లను తాకరాదన్నారు.

# షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు



శ్రీరామ వెంకటసుబ్రమణ్యం ఫైల్ ఫోటో

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణ సమీపంలోని ఎస్.ఆర్.బి.సి కాలనీలో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం నందు ఈ నెల 21వ తేదీ ఆదివారంనాడు గురుపౌర్ణమి సందర్భంగా స్వామి వారికి ఉదయం కాగడ హారతి బాబావారి భక్తులచే పాలాభిషేకం అనంతరం అల్పాహారం ఉదయం 6గంటల నుండి 12గంటల వరకు అఖండ సాయినామ కార్యక్రమం మధ్యాహ్న హారతి, అన్నదానం, సాయంకాల హారతి, పల్లకీసేవ, సత్సంగం, బాబా వారి పాద పూజ కార్యక్రమం 8గంటలకు అల్పాహారం, 9గంటలకు తేజ్ హారతి నిర్వహిస్తున్నట్లు శ్రీరామ వెంకటసుబ్రమణ్యం తెలిపారు. అలాగే ఎన్. శ్రీనివాసులు ప్రమీళాదేవి, శంకర్ రెడ్డి శ్రీమతి వెంకటలక్ష్మమ్మల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ముగిసిన రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల బాలికల చదరంగం పోటీలు



**రాష్ట్రస్థాయి చెస్ పోటీల విజేతలతో అతిథులు ,నిర్వాహకులు**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** స్థానిక రామకృష్ణ పీజీ కాలేజీలో రెండు రోజులుగా జరిగినటువంటి అండర్ 19 బాల బాలికల చదరంగం పోటీలు ముగిసాయి.ఈ చదరంగ పోటీలలో బాలుర విభాగంలో కుశల్ (అనంతపూర్ ),ధ్రువీశ్ దొండపాటి (గుంటూరు )మజ్జి రాంచరణ్ తేజ (తూర్పు గోదావరి )హర్షవర్ధన్ ఆచారి (నంద్యాల జిల్లా)బాలికలవిభాగంలోశర్వాణిచిదేళ్ల (ఎన్టీఆర్జిల్లా )హిమాతేజేశ్వి ని (నెల్లూరు )జి. శ్రీహ (అనంతపూర్ )కావ్యశ్రీ (ఈస్ట్ గోదావరి ) జాతీయ స్థాయి చదరంగం పోటీలకు ఎంపికయారని టోర్నమెంట్ ఆర్గనైజర్ జి. రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్. జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం క్రీడ విద్యార్థుల మేథ స్సుకు పదును పెడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధు లుగా డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి ,ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాజశేఖర్రెడ్డి, భారతీయ క్రీడా భారతి సెక్రటరీ సుధాకర్, లయన్స్ క్లబ్ సెక్రటరీ శిరిగిరి రమేష్, చీఫ్ ఆర్బీటర్ ఉదయ్ కుమార్ నాయుడు, అల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ గోవింద్ జియ్యర్, టోర్నమెంట్ డైరెక్టర్ సుజాత, అర్బీటర్లు ఇమమా, రవినాయక్ పాల్గొన్నారు.అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రం అందజేశారు.

# భక్తిశ్రద్ధలతో మౌలాలి పీర్ల ఊరేగింపు

**ఆకట్టుకున్న యువకుల విన్యాసాలు**



**పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం**



**విన్యాసాలు చేస్తున్న యువకులు**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** మొహర్రం వేడుకలు సందర్భంగా శుక్రవారం పట్టణం లోని పెద్ద కటికె వీధి, గంగన్న మసీద్ వద్ద భక్తిశ్రద్ధలతో మౌలాలీ పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మౌలాలీ పేర్ల దేవుడికి పూలతో ప్రత్యేక అలంకరించి భక్తులు చక్కర చదివింపులు చదివించి కుల మతాలకు అతీతంగా మొక్కులు తీర్చుకున్నా రు. భక్తులు ప్రత్యేక ఫాతేహాలు చేశారు. గోనెగండ్ల రోడ్డు, పెద్ద కటికె వీధిరోడ్డు, షరాఫ్ బజారు మీదుగా పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. యువకుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కర్రసాము, అగ్నిగోళాన్ని తిప్పడం, కడిమానతిప్పే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పీర్ల ఊరేగిం పు సందర్భంగా పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకు న్నారు. కార్యక్రమంలో బందే నావాజ్, రసూల్, రహంతుల్లా, కిబిరియా, జాకీర్, హనీఫ్, కౌన్సిలర్ ఖాసీం బేగ్, మాజీ కౌన్సిలర్ దాదా సాహెబ్ పాల్గొన్నారు.

# అట్టహాసంగా మాండ్ర జన్మదిన వేడుకలు

- **శుభాకాంక్షలు తెలిపిన కన్వీనర్ కాత రమేష్ రెడ్డి**
- **అల్లూరుకు తరలిన మాండ్ర అభిమానులు**
- **టిడిపి శ్రేణుల రాకతో కిటకిటలాడిన అల్లూరు**



**మాండ్ర శివానందరెడ్డి కేక్ కట్ చేస్తున్న దృశ్యం**

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం నంద్యాల పార్లమెంట్ టీడిపి ఇన్చార్జి మాండ్రశివానం దరెడ్డి పుట్టినరోజు వేడుకలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధుల, అభిమానుల మధ్య అట్టహాసంగా మాండ్ర జన్మదిన వేడుకలు జరిగాయి. మాండ్ర అభిమానులు, టిడిపి శ్రేణులు ,కార్య కర్తలు భారీగా తరలి రావడంతో అల్లూరు భారీ జన సందోహంతో కిటకిటలాడింది. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మిడు తూరు టిడిపి మండల కన్వీనర్ కాత రమేశ్ రెడ్డిల ఆధ్వర్యంలో, కార్యకర్తలతో కలిసి అభిమాన నేత మాండ్ర శివానందరెడ్డిని పూల మాలతో శాలువాలతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.భగవంతుడి ,ఆశీస్సులు , దీవెనలు ప్రజల అండదండలతో నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేతో కలిసికృషి చేస్తానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. మిడుతూరు మండల టిడిపి కన్వీనర్ కాతా రమేష్రెడ్డి,మాండ్రా శివానందరెడ్డితో కేక్ కట్ చేయి ంచి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తోపా టు నందికొట్కూరు మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్ రెడ్డి టిడిపి సీని యర్ నాయకుడు పల్లె రఘునాథ్ రెడ్డి ,ఐటీడీపీ కన్వీనర్ ఇంతియా జ్ భాషా కమతం రాజశేఖరరెడ్డి, పీరుసాహెబ్ పేట నాయకులు దేరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, దేరెడ్డి మహేశ్వర్ రెడ్డి ,ఎం.మహేశ్వర్ రెడ్డి, జయరాముదు రామేశ్వర్ రెడ్డి , చౌట్కూర్ టిడిపి నాయకులు నరసింహా గౌడ్, శబ్ బాషా,పైపాలెం నాయకులు రైతు బజార్ శివకుమార్ ,టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు భారీగా మాండ్ర జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

ఈనెల 23వ తేదిన

# ఈరన్నగట్టు చెరువు వేలంపాట

**వెల్దుర్తిరూరల్, మేజర్న్యూస్ః** కర్నూలు జిల్లా అటవీశాఖాధి కారి ఉత్తర్వుల మేరకు ఈనెల 23వ తేదిన ఈరన్నగట్టు చెరు వులో చేపలను పెంచుకొని, వాటిని పట్టుకొని అమ్ముకునేం దుకు వేలము ఎంఎఫ్పి లీజు యూనిట్ 2024-2025 సంవత్సరానికి(1-7-2024 నుండి 30-6-2025 వరకు) వెల్దుర్తి బీటులో గల వీరన్నగట్టు చెరువులో చేపలను పెంచు కొనుటకు ఈనెల 23వ తేదిన అటవీ క్షేత్రాధికారి, కర్నూలు వారిచే రేంజ్ కార్యాలయం నందు ఉదయం 11ః00 గంటల కు బహిరంగ వేలం వేయబడునని కర్నూలు రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ జి.విజయ్కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున వేలంపాటలో పాల్గొనే వాటదారులంద రూ పైన తెలిపిన తేది, ప్రాంతానికి సమయానికి రావాల న్నారు. వేలం పాటలో పాల్గొనే వేలందారులందరూ వేలానికి ముందు రూ. 1,000లు చెల్లించాలని, వేలం ముగిసిన వెంట నే పాటను దక్కించుకున్న వారు వేలం మొత్తం డబ్బులను చెల్లించాలని, వేలం పాడిన డబ్బు పైన ఇన్కంట్యాక్స్ వంటివి ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి చెల్లించాలని ఆయన సూచించారు.

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా

# తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని దీని వలన విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి కాబట్టి తగు జాగ్రత్తలు పాటించడం వలన విద్యుత్ ప్రమాదాలను తగ్గించవచ్చు అవి 1. ఇళ్ల డాబాపైన బట్టలు ఆరవేయునప్పుడు మరియు ఇళ్ల నిర్మాణము జరుగుచున్నప్పుడు ఇళ్లపైన మరియు సమీపాన విద్యుత్ లైన్లు ఉన్నచో విద్యుత్ నిబంధనల ప్రకారం తగినంత దూరం పాటించవలెను 2. కొబ్బరి, పామాయిల్ మొదలగు తోటలలో కొమ్ములు తొలగించేటప్పుడు విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 టోల్ ఫ్రీ నెంబరుకు ముందుగా తెలియచేసినచో లోకల్ విద్యుత్ సిబ్బంది ద్వార అవసరమగు (లైన్ క్లియర్) ఏర్పాటు చేసి వారి పర్యవేక్షణలో పనిచేయవచ్చు. తొందరపడి ప్రమాదాలకు గురికావద్దు. 3. వీధి దీపాలకు సంబంధించిన ఫీజ్ వైర్ల మరమ్మత్తులకు లైను క్లియర్ తీసుకుంటే తప్ప పాడైన స్విచ్లు, బల్బులు మార్చుట మొదలగు వాటిని అనుమతించిన సిబ్బంది మాత్రమే చేయవలెను. మరి ఏ ఇతర వ్యక్తులు చేయరాదు. 4. తోటలలో కానీ, పొలాలలో కానీ ఇతర ఏ ప్రదేశములోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగి పడి వుంటే వాటిని నేరుగా తాకరాదు వెంటనే విద్యుత్శాఖ సిబ్బందికి లేదా 1912కి తెలియచేయవలెను. 5. ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనించిన యెడల ఆ వ్యక్తిని గాని విద్యుత్ పరికరాన్ని గాని నేరుగా తాకరాదు వెంటనే దగ్గరలోని విద్యుత్ అధికారి / సిబ్బందికి తెలియపరచవలెను.

వీడని చినుకు...

# జలమయమైన లోతట్టు ప్రాంతాలు

- ఇండ్లలోకి వర్షపు నీరు... ఇబ్బందుల్లో పలు కాలనీలవాసులు
- డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే
- కంటితుడుపు చర్యలతో చేతులు దులుపుకుంటున్న అధికారులు
- లోతట్టు ప్రాంతాలను పరిశీలించి టిడిపి పట్టణ అధ్యక్షులు వేణు



లోతట్టు ప్రాంతాలు జలమయమైన దృశ్యం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో గత వారం రోజులుగా చినుకుదు వీడడం లేదు. పోటుకులా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే చిన్నారులు, వృద్ధులు సాహించడం లేదు. ఎడతెరపి లేని వర్షంతో పట్టణంలోని పలు కాలనీలతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటితో నిండి ఇండ్లలోకి నీరు చేరుకుంది. వర్షాకాలం ప్రారంభమైందంటేనే దోమలు వ్యాప్తిచెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెబుతున్న అధికారులకు లోతట్టు ప్రాంతాల్లోని వర్షపు నీటిలో మురుగు చేరి కంపుకొడుతున్నా పట్టించుకొనే పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఇష్టానుసారంగా సిమెంట్ రోడ్లు వేసుకొని డ్రైనేజిలను నిర్మించడం మరిచారని, డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి తటాకాలను తలపిస్తుంద ని, అధికారులకు ఫిర్యాదు చేస్తే కంటితుడుపు చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇండ్లలోకి నీరు చేరుకోవడంతో వంట చేసుకోవడానికి కూడా ఇబ్బంది కరంగా ఉందని, ఇంటి చుట్టుపక్కల వర్షపు నీరు నిండుకొని ఉండడంతో ఆ నీటిలో నుంచి ఏ విషపురుగులు వస్తాయోనని బిక్కు బిక్కుమంటూ జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొనిందని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు ఉన్న వీధి దీపాలు కూడా వెలగక పోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఎటువెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని లోతట్టు ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. పట్టణంలోని పలు కాలనీలతో పాటు ప్రధాన కూడళ్ళలో మున్సిపల్ కార్మికులు చెత్తను తొలగించకపోవడంతో వర్షంలో తడిచి భరించలేని దుర్గంధాన్ని వెదజల్లుతుందని, అటుగా వెళ్లాలంటేనే ఎక్కడ వ్యాధులు సోకుతాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి ముందే వర్షపునీరు, దానికి తోడు చెత్త అలాగే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరపబడి చెత్తను ఎత్తకపోవడంతో మున్సిపల్ కార్మికులు ఉన్నారా లేక ఏదైనా సమ్మె చేస్తున్నారా అని ప్రజలతో చర్చించుకుంటున్నారు. వార్డు బాగోగులు చూసుకోవాల్సిన కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో తిప్పలు తప్పడం లేదని విమర్శలు చేస్తున్నారు. రోగాల భారిన పడి భారీ నష్టం జరిగితే తప్పా పట్టించుకోరా, పేదల ప్రాణాలతో చెలగాటమా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే టిడిపి పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్ , టిడిపి నాయకులు తిమోతిలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించడం జరుగుతుందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలకు వారు హామీ ఇచ్చారు.



లోతట్టు ప్రాంతాలు జలమయమైన దృశ్యం



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న టిడిపి పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్

రైల్వే ఆధునీకరణ పనులపై

# డీఆర్ఎంతో చర్చలు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులపై ఎంపీ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు నరహరి విశ్వనాథరెడ్డి పరిశీలించి అధికారులతో చర్చించారు. అలాగే తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ నంద్యాల రైల్వేస్టేషన్‌కు విచ్చేసిన రైల్వే డీఆర్ఎం రామకృష్ణతో స్టేషన్ అభివృద్ధిపై పలు అంశాలు చర్చించారు. ఈసందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా 30 అడుగుల రోడ్డును 40అడుగులుచేయాలని డీఆర్ఎంను కోరారు. రైల్వే స్టేషన్‌లో పార్కింగ్, రైల్వేట్రాక్, మొదలగు సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. అనంతరం రైల్వే డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ నంద్యాల రైల్వే స్టేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కృపాకర్, వాకా శివశంకర్, అజ్మీర్, నరహరి విశ్వనాథరెడ్డి, దీపక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులపై అధికారులతో చర్చిస్తున్న నరహరి విశ్వనాథ్‌రెడ్డి



రైల్వే డీఆర్ఎంతో అభివృద్ధి పనులను చర్చిస్తున్న ఎన్ఎండి ఫిరోజ్

## జిల్లా సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మంత్రి బి.సి

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయం నందు జరుగుతున్న జిల్లా సర్వసభ్య సమావేశంలో మంత్రి బి.సి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించడం జరిగింది. అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు టి.జి భరత్, ఎన్.ఎం.డి ఫరూక్, బైరెడ్డి శబరి, పలువురు శాసన సభ్యులు ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మంత్రి బి.సికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

## కర్నూలు రేంజ్ డీఐజీని కలిసిన నూతన ఎస్పీ



పూలమొక్క అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జి.బిందుమాధవ్ శుక్రవారం కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డిఐజి కార్యాలయంలో డీఐజీకి పూలమొక్క అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

# మహానంది మండలంలో కుండపోత వర్షం

– సరైన వసతులు లేక గిరిజన గూడాల్లో అవస్థలు

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురుస్తుండటంతో మండలంలోని గాజులపల్లి, మహానంది, అబ్బీపురం గ్రామాల్లోని గిరిజన గూడాలు, గ్రామాలలోని లోతట్టు ప్రాంతాలు బురద కూపంలా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓ వైపు భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతన్న ఆనందానికి అవధులు లేవు. విత్తనం వేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకున్న రైతన్నకు ఈ వర్షం ఊరటనిచ్చింది. వర్షాలు ఎడతెరపినిస్తే విత్తనం వేసేందుకు సమాయత్తమవుతున్నారు.



గిరిజన గూడంలో ప్రజల అవస్థలు



మహానందిలో కురుస్తున్న భారీ వర్షం

## ఉమ్మడి జిల్లాల ఎన్నికల తహశీల్దార్ల బదిలీ

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమీషన్ బదిలీపై వెళ్లిన తహసిల్దార్ల ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తహసిల్దార్లను పొరుగు జిల్లాలైన కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు బదిలీ చేసింది. జోన్ –4 కింద అనంతపురం జిల్లాలో 62, చిత్తూరు జిల్లాలో 67, కర్నూలు జిల్లాలో 61, వైఎస్ఆర్ కడప జిల్లాలో 59 మంది తహసిల్దార్లతో పాటు రాయలసీమ జిల్లాలో 3 సంవత్సరాల ఉద్యోగ విరమణ ఉన్న 15 మందిని, ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేయనున్న మరో 28 మంది తహసిల్దార్లను పని చేసే జిల్లాలోనే కలెక్టర్ కార్యాలయాలతో పాటు ఆర్‌డిఓ తదితర కార్యాలయాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసిల్దార్లను తిరిగి గతంలో పని చేసే వారి స్థానాలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ముగిసి రెండు నెలలు కావస్తున్నా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి బదిలీపై ఇతర జిల్లాకు వెళ్లిన తహసిల్దార్లు బదిలీ కోసం వేచి చేస్తున్నారు. ఆయా జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసిల్దార్లను అదే స్థానాలకు బదిలీ చేసింది. త్వరలోనే తిరిగి రాష్ట్ర వ్యాప్తంగా మరో సారి సాధారణ బదిలీలు ఉంటాయి.